




## (గత సంచిక తరువాయి)

**ఆ యూనివర్శిటీ** మూడేళ్ళూ ఒక పక్క మల్లంపల్లి సోమశేఖర శర్మ(ఆయన తెలుగుశాఖలో పనిచెయ్యడానికి వచ్చారు), గంటి జోగి సోమయాజులుగారు వంటి పండితుల ప్రసంగాలు వినడం, నాటక సాహితీరంగాలలో మనస్సులోని ఉత్సాహానికీ, ఉద్వేగానికీ కొంత సాధన రూపానివ్వడం, చావు తప్పి కన్నులొట్టపోయినట్టు – జీవితాంతం పేరు చివర ఓ తోకని బియస్సీ ఆనర్స్‌ని మిగుల్చుకోవడం జరిగింది. నా పరంగా చూసినప్పుడు నా కార్యకలాపాలు, వ్యావృత్తుల దృష్ట్యా – ఆ మాత్రమయినా డిగ్రీతో బయటపడడం ఘన విజయమేనని బావిస్తాను యిప్పటికీ.

నేను ఢిల్లీలో ఉన్న ఆ కాసిని రోజుల్లో పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు నార్త్ ఎవెన్యూలో అప్పటి పార్లమెంట్ మెంబర్ మోతే వేదకుమారిగారింట్లో ఉండేవారు. ఆ విధంగా వేదకుమారి పరిచయం జరిగింది.

నేను విశాఖపట్నంలో ఉండగానే ఒక విచిత్రమయిన ఉత్తరం వచ్చింది. వేద కుమారిగారి దగ్గర్నించి వారి తండ్రిగారు ఒకప్పుడు సంప్రదాయ నాటకరంగాన్ని ఉద్ధరించిన మోతేవారి కంపెనీ స్థాపకులు – మోతే నారాయణరావుగారు. ఆయన అస్వస్థులుగా విశాఖపట్నం యోగాశ్రమంలో చికిత్స పొందుతున్నారు. వారికి తను స్వయంగా ఢిల్లీ నుంచి పంపినట్టు ఆపిల్ పళ్ళు తీసుకెళ్ళి యివ్వమని అభ్యర్ధన. ఆ మాత్రం అభిమానాన్ని ప్రదర్శింప వీలులేని కార్యక్రమాలలో మునిగితేలే సెన్సిటివిటీస్ ఇంకా పోగొట్టుకోని ఓ కూతురి కోరిక అది. ఇప్పుడయితే యోగాశ్రమం నగరంతో కలిసిపోయింది కాని ఆ రోజుల్లో ఒకటో రెండో బస్సులు మానసిక వ్యాధుల ఆసుపత్రిదాకా వెళ్ళేవి. అక్కడ నుంచి ఆశ్రమందాకా నడవాలి. మా నాన్నగారు ఆపిల్ పళ్ళు కొని నాతో వచ్చారు. నారాయణరావుగారిని కలిశాం. పళ్ళు చూసి, వారమ్మాయి పంపిందని విని చాలా ఆనందించారు నారాయణరావుగారు. ఇది సంప్రదాయ నాటక రంగ పోషకునికీ, ఔత్సాహిక నాటక రచయితకీ విచిత్రంగా కలిసిన చిన్న లంకె. తరువాత నారాయణరావుగారు ఎంతోకాలం జీవించలేదనుకుంటాను. ఆ తర్వాత మరో మూడునెలలకి ఢిల్లీ వెళ్ళినప్పుడు పురాణం, నేనూ వేదకుమారిగారింట్లోనే వంట చేసుకు గడిపేవాళ్ళం. అప్పుడు వేదకుమారిగారు ఘనా టూర్ వెళ్ళారు. అది మరొక కథ.

ఆనర్స్ వేసవి శెలవుల నాటికి కె.వెంకటేశ్వరరావు విజయవాడ వచ్చేశాడు. కనకదుర్గ ఆలయం పక్కనే ఇల్లు. ఇల్లాలు – నాకు వదినగారు – శారదమ్మ దేవత. ఆయన గొప్పతనాన్నీ, అరాచకత్వాన్నీ, అక్రమ శిక్షణనీ భరించిన ఉత్తమ ఇల్లాలు. ఆయన్నీ, ఆయన ప్రతిభనీ నిస్సంశయంగా ప్రేమించిన అభిమాని ఆమె. వెరసి సంవత్సరాల తర్వాత నా 'మహానటుడు' నాటకంలో ముఖ్యపాత్ర. ఢిల్లీలో ఉన్న రోజుల్లో శారదమ్మ చేత 'కప్పలు' నాటకంలో వేషం కూడా వేయించాడు వెంకటేశ్వరరావు.  ఆయనకోసం తెలిసి తాగగలదామె. ఎంతమంది ఇలాంటి ఇల్లాళ్ళు భర్తల్ని సంప్రదాయం అనే 'ముసుగు' కోసం కాపాడుతున్నారో. ఈ కోవలో మా ఆవిడ కూడా ఉంటుంది. అనాయాసంగా, అయితే కథ అంత ముందుకి దూకడం అన్యాయం.

ఉదయమే నేనూ, వెంకటేశ్వరరావూ, కృష్ణానదికి స్నానానికి వెళ్ళడం, నాటకాన్ని గురించి దారిపొడుగునా చర్చ. తర్వాత అతను ఆఫీసుకు వెళ్తే రోజంతా నేను రచన చేసుకుంటూ, శారదమ్మ ఇంటి పనులు చేసుకుంటూ గడపడం. రాత్రి నాటకం మీద మళ్ళీ చర్చలు. ఇలా దాదాపు నెలరోజులపైగా సాగింది. ఆ రోజుల్లో ఓ కుర్రాడు తరుచు కిటికీ దగ్గర కనిపించి మాయమవుతూండేవాడు 'నాకూ ఓ వేషం రాసిపెట్టండి గురూగారూ' అంటూ. అతని పేరు రాజబాబు. తెలుగు సినీరంగాన్ని ఊపి ఉర్రూతలూగించిన హాస్యనటుడు. పెద్దల్నీ, గురువుల్నీ గౌరవించే సంస్కారి. సినిమా రంగంలో డబ్బు పాపులారిటీ వెరసి 'మందు' అనే భూతం కబళించిన దురదృష్టవంతుల్లో ఒకడు.

ఆ రోజుల్లో అద్భుతమయిన జ్ఞాపకం నరసయ్యపాలెంలో 'దొంగవీరడు' ప్రదర్శన. అందులో ముందు కాలంలో విజృంభించనున్న రాజబాబు నటనలో హాస్యనటుడికి కావలసిన గొప్ప టైమింగ్, వెంకటేశ్వరరావు విశ్వరూపమే గుర్తున్నాయి. అంతకుమించి కొర్రపాటి, రామగోపాల్ (దీక్ష ఫేం), పి.ఎల్.నారాయణలతో పరిచయాలు జరిగింది అక్కడే. ఈ పరిచయాలు ఆయా వ్యక్తుల జీవితకాలమంతా నిలిచాయి.

ఈ సందర్భంలో వెంకటేశ్వరరావు ఆత్మ విశ్వాసానికీ మచ్చుతునకగా, నాకు మాత్రం సంభ్రమాన్ని కలిగించేదిగా గుర్తున్న ఓ సంఘటన. ఓ రోజు 'వెంకటేశ్వరరావుగారూ' అంటూ బయటనుంచి ఎవరో పిలిచారు. ఆ వెళ్ళడం వెళ్ళడం రాత్రి ఎప్పటికో తిరిగి వచ్చాడు వెంకటేశ్వరరావు. 'ఎక్కడికి వెళ్ళారు?' అన్నాను.

'డాక్టర్ గరికపాటి రాజారావుగారొచ్చా రు. ఆయనతో రోజంతా గడిపి ఆయన్ని పంపించి వస్తున్నాను' అన్నారు.

నేను తుళ్ళిపడ్డాను. 'రాజారావుగారొస్తే నన్ను పరిచయం చెయ్యరా?' అన్నాను బాధగా.

వెంకటేశ్వరరావు నవ్వి "రాజారావుగారు 'నాకు మారుతిరావుని పరిచయం చెయ్యండి' అని అడిగిన రోజున పరిచయం చేస్తాను" అన్నారు.

ఇది అతని అహంకారంగా, నాకేమో పరిహాసంగా తోచింది. ఈ సంఘటన 1959లో జరిగింది. 1964 ప్రాంతంలో మద్రాసు కృష్ణగాన సభలో నా నాటకం – అప్పుడు రాసిన నాటకం 'రాగరాగిణి' ప్రదర్శన. ఆనాడు ప్రేక్షకుల్లోకి దూసుకుపోయింది ప్రదర్శన. మద్రాసులో తెలుగు, తమిళ చిత్రాలలోని నటులంతా ఆనాడు ప్రేక్షకుల్లో ఉన్నారు. జి.వరలక్ష్మి, మ్యూజిక్ డైరెక్టర్ టి.వి.రాజు, తమిళ కారెక్టర్ నటుడు సహస్రనామం, మరొక మహా రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి – ఒకరేమిటి? సినీ ప్రపంచం యావత్తూ అక్కడ ఉంది. ప్రదర్శనానంతరం చాలామంది వచ్చి నన్నూ, వెంకటేశ్వరరావునీ అభినందిస్తున్నారు. వెంకటేశ్వరరావు నా భుజం తట్టి 'రాజారావుగారు నిన్ను పరిచయం చెయ్యమంటున్నారు. రా' అని తీసుకెళ్ళాడు. కరెంట్ షాక్‌లాగ అయిదేళ్ళ క్రిందటి వెంకటేశ్వరరావు మాట గుర్తుకొచ్చింది. నాటకాన్ని మెచ్చుకుంటూ రాజారావుగారు మాట్లాడారు. నేనేమన్నానో గుర్తులేదు. మైకంలో ఉన్నాను. అదే రాజారావుగారిని మొదటిసారి, ఆఖరుసారి కలవడం. అలా నా దగ్గరకి వచ్చి పరిచయం చేసుకున్న మరొక వ్యక్తి ఉన్నారారోజు. ఆయన పేరు ఆచార్య ఆత్రేయ. చాలా మర్యాదగా, క్లుప్తంగా మాట్లాడి వెళ్ళిపోయారు ఆత్రేయ. ఆ రోజు నేను పంచె, లాల్చీ వేసుకున్నాను. నేను సినీరంగంలో ప్రవేశించాక ఓసారి ఆత్రేయగారన్నారు 'ఆ రోజు పంచె, లాల్చీలో నిన్ను చూసి వయస్సులో చాలా పెద్దవాడనుకున్నానయ్యా' అని. ఆ కారణంగా నేను అప్పట్లో నాకు లేని పెద్దరికపు 'బురఖా' ధరించాను. అంతే. ఆ తర్వాత మరెప్పుడూ ఏ సభల్లోనూ పంచె, లాల్చీ వెయ్యలేదు. ఇప్పటికీ అదే పద్ధతి. నా వయస్సుని అనుభవం చెప్పాలికాని, అవతారం కాదని నేర్చుకున్న సందర్భమది.

రాగరాగిణి నాటకాన్ని వెంకటేశ్వరరావుకి అంకితం ఇచ్చాను. ఈ అలవాటు నాకు చాలా తక్కువ. ముందు మాటలూ, అంకితాలూ నా ప్రవృత్తికి చాలా చాలా దూరం. నేను చాలామందికి వ్రాస్తూ వచ్చాను కాని – ఓ పి.వి నరసింహారావు, ఓ సినారె – ఆయా ప్రచురణకర్తలు కోరిన ముందు మాటలు – "వందేమాతరం, లావాలో ఎర్రగులాబీ" నాటకాలకి నేను కోరి అడిగిన ముందు మాట పుట్టపర్తి నారాయణాచార్యులుగారిని – ప్రచురణ అయిన నా మొదటి నవల 'చీకటిలో చీలికలు'కి. అయినా 'రాగరాగిణి' అంకితాన్ని అందుకోక ముందునుంచి నన్ను 'మామా' అనేవాడు వెంకటేశ్వరరావు. అతన్ని 'వెంకు ' అనేవాడిని. నాకంటే కేవలం వయస్సులోనే కాక ఎన్నో విధాలా పెద్ద వెంకు. కాని రాగరాగిణి నాకు సంపాదించి పెట్టిన బంధుత్వం అది. ఈ బంధుత్వం చివరంటా నిలుపుకున్నాం మేమిద్దరం.

నా పద్దెనిమిదవ యేట బాగా గుర్తున్న సందర్భం – మునిసిపల్ స్టేడియంలో అక్కినేని సన్మానం. ఎవరు ఆహ్వానించారో గుర్తులేదు కాని ఆ సభలో రాఘవ కళానికేతన్ తరపున అద్భుతంగా సన్మాన పత్రం రాసి గంభీరంగా సభలో చదివాను. అక్కినేని వింటూ ముగ్ధులయిపోతారని నా భావన. నేను చక్కగా ముస్తాబయి, ఖంగుమంటూ మైకు ముందు చదువుతున్నంతసేపూ ఆయన ఎవరితోనో కబుర్లు చెబుతున్నారు. నేను చదవడం అయాక అతికించుకున్న

చిరునవ్వుతో సన్మాన పత్రాన్ని అందుకున్నారు. సభ అయాక నా సన్మాన పత్రం ఉండిపోయింది. అప్పటి నా నిర్వేదం, బాధా వర్ణనాతీతం. సరిగ్గా అయిదేళ్ళ తర్వాత నా సినీ రచనా వ్యాసంగం అక్కినేని చైర్మన్‌గా ఉన్న అన్నపూర్ణా సంస్థలోనే ప్రారంభమయింది. కొన్ని వందల సార్లయినా నేను రాసిన ఎన్ని సీన్లని ఆయన శ్రద్ధగా, తదేకమయిన దృష్టితో వల్లెవేశారో! ఇది జీవితం నాకు ప్రసాదించిన ముచ్చటయిన వెండికేషన్‌గా భావిస్తాను. ఇది జీవితం నాకిచ్చిన బహుమతులలో కేవలం మొదటిది. అయితే తర్వాతి రోజులలో అక్కినేనిగారి స్థితిని అర్థం చేసుకునే పరిస్థితులు నాకూ ఏర్పడ్డాయి. నేనూ ఆయన స్థితిలో చాలాసార్లు నిస్సహాయంగా ఉండిపోవలసి వచ్చింది. కాని యిప్పటికీ – సభలో నాకిచ్చిన వస్తువులో, దండలో వీలైనంతవరకూ నాతోనే తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తాను. వదిలిపెట్టను. నాపట్ల గౌరవం చూపినవారికి నేను చెయ్యగల కనీస మర్యాద యిది.

మా నాన్నగారికి మొదటినుంచి కొత్త వస్తువులు కొనడం అలవాటు లేదు. ఆరోజుల్లో అది నాకు కాస్త వింతగా అనిపించినా జీవితం మీద అవగాహన అందుకు కారణాన్ని బోధించింది. ఆయన నేలబారు స్థాయినుంచి పెరిగిన మనిషి. అదనపు సౌకర్యాల కంటే కనీస సౌకర్యాలకు ప్రాముఖ్యాన్ని ఇవ్వడం ఆయనకి జీవితం నేర్పిన పాఠం. ఆ జాగ్రత్తని ఆయన జీవితమంతా తీసుకున్నారు. దేనికీ ఆయన డబ్బు తడువుకున్న సందర్భం నాకు తెలీదు. యూనివర్శిటీకి వెళ్ళడానికి అప్పట్లో బస్సు టిక్కెట్టు మూడు అణాలని గుర్తు. ప్రతీ దినం అడిగి తీసుకోవాల్సిందే. మాది చాలా సాదా కుటుంబమయినా ఏ లోటూ మమ్మల్ని ఆయన తాకనివ్వలేదు. ఇది చెప్పడానికి కారణం – నా అనంతం నాటికకు వచ్చిన బహుమతి పైకం 150 రూపాయలు. మొదటి రేడియో ప్రసారం 'శాఫో' నాటికకి వచ్చిన 15 రూపాయలు కలిపి మొదటి ఫిలిప్స్ రేడియో కొన్నాను. అదొక అపూర్వమయిన సంఘటన. మా నాన్నగారే నన్ను షాపుకు తీసుకెళ్ళారు. నా విజయం కేవలం రేడియో కావచ్చు. కాని ఆయన విజయం ఆయన కొడుకు. ఇద్దరం జయించిన సందర్భమది. ఏమయినా అప్పటినుంచీ బాలమురళీ కృష్ణ భక్తిరంజని, ప్రయాగ హరికథలూ, మల్లిక్ పాటలూ, రజని గేయాలూ, బాలసరస్వతి, ఎస్.వరలక్ష్మి, శాంతకుమారి, శ్రీరంగం గోపాలరత్నం, పాకాల సావిత్రీదేవి, వింజమూరి సీత, అనసూయ – అందరూ నా డ్రాయింగు రూములోకి దూసుకు వచ్చేశారు. ఉప్పెనలాంటి ప్రభావంలో మునిగితేలే యువకుడి వయస్సు అప్పుడు 20. మరొక్క మూడేళ్ళు కేవలం మూడే మూడు సంవత్సరాలకి నేనూ వాళ్ళలో ఒకడినయిపోయాను.

రేడియో ఇంటర్వ్యూలో ప్రఖ్యాత సాహితీవేత్త, రచయిత (ఆయన నన్ను ఇంటర్వ్యూ చేసిన బృందంలో ఉన్నారు) వి.కె నారాయణ మీనన్ అడిగారు 'జర్నలిజం వదిలి రేడియోకి ఎందుకు వస్తున్నావు?' అని.

'ఇంతకాలం వినే కార్యక్రమాలని చేసే స్థాయిలో పంచుకుందామని' అన్నాను. అదొక 20 సంవత్సరాల దశ.

మరొక సునామీ. జీవితం గొంగళి పురుగు దశనుంచి పంచరంగుల సీతాకోక చిలుకగా మారిపోయింది. కొత్త రెక్కలతో, కొత్త లోకాల్లోకి దూసుకుపోయింది. అయితే మధ్యలో మూడేళ్ళ పత్రికా రచయిత జీవితం ఉంది.

ఇంకా ముందు ఆరునెలల ఢిల్లీ జీవితం ఉంది. ఎందరో మహానుభావుల సాంగత్యం, రాబోయే జీవితాన్ని సుసంపన్నం చేసే హితుల పరిచయాలూ నాకోసం భారత రాజధానిలో ఎదురుచూస్తున్నాయి.

1959 జులై 18 నా జీవితంలో మరిచిపోలేని మలుపు. విశాఖపట్నంలో చదువు పూర్తిచేసుకుని, మొదటిసారి ఇంటిని వదిలి బయటి ప్రపంచమలోకి అడుగుపెట్టిన రోజు. ఢిల్లీ ప్రయాణం – మా చిన్నాన్నగారింటికి.

నా జీవితంలో ఒకే ఒక్కసారి – మా నాన్నగారూ, మా అమ్మగారూ నాకు వీడ్కోలు యివ్వడానికి వాల్తేరు స్టేషన్‌కి వచ్చారు. తర్వాత గడచిన 43 సంవత్సరాలూ మధ్య మధ్య ఇంటికి వచ్చి పోతూండడం సంభవించిందేకాని, ఇక ఏనాడూ విశాఖపట్నంలో ఉండలేదు. జీవితంలో ఒక దశకి తెరపడుతోందని ఆరోజు తెలీదు. వాల్తేరు స్టేషన్ దాటి రైలు మలుపు తిరుగుతుంటే దూరంగా మాయమవుతున్న అమ్మా, నాన్ననీ చూసి కళ్ళు చెమ్మగిల్లాయి.

గూడు వదిలిన పక్షి రెక్కలు విదుల్చుకుని ఆకాశంలోకి ఎగరాలి – తప్పదు. కాని ఆకాశం ఎంత విశాలం! ఎంత విచిత్రం!

4

***కొందరికి శుక్ర మహాదశ పసితనంలో వస్తుంది. అప్పుడేమవుతుంది? అమ్మ ఖరీదయిన పొత్తిళ్ళలో పడుకోబెడుతుంది. నాన్న ఖరీదయిన బిస్కత్తులు తినిపిస్తాడు. ఇంకా గొప్పవాడయితే పసివాడిని కారుల్లో తిప్పుతాడు. ఏమయినా ఆ ఆనందం మనస్సుదాకా పోదు. పోయే వయస్సు కాదు కనుక. ఇంకొందరికి వయస్సు మళ్ళాక వస్తుంది. అప్పుడేమవుతుంది? ఖరీదయిన చేతికర్ర, అందమయిన మందుల డబ్బా, పిల్లల ప్రేమాభిమానాలు (అమెరికా వంటి దేశాల నుంచి ప్రసరిస్తే) సుఖమయిన వృద్ధాశ్రమం, బంగారు అక్షరాలతో బైండు చేసిన భగవద్గీత పుస్తకం, పోయాక గోడ మీద గిల్ట్ ఫ్రేముతో వేలాడే ముసిలి ఫోటో – యివి దక్కుతాయి.***

అనుభవించే వయస్సులో, మనసారా ఆనందించగల తరుణంలో ఏ దశయినా కలిసిరావాలి. అప్పుడు ఆ దశకీ, ఆ వ్యక్తికీ రాణింపు. దాదాపు అలాంటి దశకి ప్రారంభం నేను ఢిల్లీలో అడుగుపెట్టడం. సంపద ఆస్తి రూపంలో కాదు, సాహితీ రంగంలో నా సంపదను ఇనుమడింపజేసే పెద్దల సాంగత్యం రూపంలో నాకు దక్కింది.

నా జీవితంలో నాకు దక్కిన అదృష్టం – చిన్నతనం నుంచీ నాకంటే అన్ని విధాలా పెద్దలతో నా సాంగత్యం. ఏవిధంగా చూసినా గర్వపడనక్కరలేనంతటి ప్రతిభా వ్యుత్పత్తులు నా సమక్షంలోనే ఉండడం. ఈ వాతావరణం ఎప్పుడూ

నాకు వినయాన్నీ, విచక్షణనీ, తలకి రక్తం దూకని సంయమనాన్నీ నేర్పుతూ వచ్చింది. ఆ రోజుల్లో ప్రతీ వ్యక్తి నాకో ఉపాధ్యాయుడు. ప్రతీరోజూ ఓ కొత్త పాఠం. ప్రతీ సన్నివేశం ఓ అనుభవం. రోజుకి 20 గంటల పాటు జీవితం, సాహిత్యం, నాటకం అనే పాఠశాలలో తర్ఫీదు. వెరసి – యివాల్టి నేను.

మా చిన్నాయన మిలటరీలో హవల్దారు. నిజమయిన మిలటరీ మనిషి. ఆజానుబాహువు. దబ్బపండు ఛాయ. గొంతు ఎత్తితే నాలుగు వీధులు అవతలికి వినిపిస్తుంది. విధి వైపరీత్యమేమంటే మా పిన్నికి బ్రహ్మ చెముడు. ఆయన కోపంలో గొంతు భాగం మాకూ, ముఖం మాత్రమే ఆవిడకీ తెలిసేది. అయితే మేం బెదిరినంతగా ఆవిడ బెదిరేది కాదు. కోపం తీవ్రత ఆవిడకేనాడూ అందలేదు కనుక. కాని ఆయన కోపం క్షణికం. మనిషి భోళా, ఎప్పుడూ బరంపురం సుగంధీ కారా నమిలేవాడు. ఆయన దగ్గర ఉంటే మనకీ నమలాలన్నంత రుచికరమయిన పరిమళం చుట్టేసేది. ఆ 'కారా' అంత మనిషినీ సంవత్సరాల తర్వాత లొంగదీసి, కుదించి, ఆఖరికి కొరికేసింది. ఆయనకి అయిదుగురు కూతుళ్ళు. అయితే మా అమ్మ తరపున అన్ని కుటుంబాల్లో నేనే పెద్ద. ఢిల్లీ ఈస్ట్ పటేల్ నగర్ మిలటరీ క్వార్టర్స్‌లో మకాం. తెల్లవారేసరికి మిలటరీ యూనిఫారాల్లో కాలనీ కాలనీ అంతా మేలుకునేది. అందులో పంజాబీలు, తమిళులు, గుజరాతీలు ఒకరేమిటి అన్ని ప్రాంతాల వారూ ఉండేవారు. అదంతా ఓ విలక్షణమైన వాతావరణం.

మా చిన్నాన్నగారింట్లో ఉన్నాననన్నమాటేగాని, రోజులన్నీ నార్త్ ఎవెన్యూలో మోతే వేదకుమారిగారి ఫ్లాట్‌లో (1882) – పురాణం సుబ్రహ్మణ్య శర్మగారితో గడిచేవి. రచయితగా, మనిషిగా అన్నిటా జీవితాన్ని ఎలా నడుపుకోవాలో ఆయన వివరిస్తూ ఉండేవారు. అప్పటికి నా మీద బుచ్చిబాబుగారి 'చివరికి మిగిలేది', చలంగారి 'మ్యూజింగ్స్' ప్రభావం ఉండేది. ఆ రోజుల్లో ప్రతీ వస్తువు ఒక muse. పేజీలు నింపుకుంటూండేవాడిని. అప్పుడే 'చీకటిలో చీలికలు' నవల రచన ప్రారంభించాను. ఓ కుర్రాడిలో ఉన్న వాడీ, వేడీ, యింకా జీవితానికి అన్వయం కాని కలలాంటి కథా కల్పన, సన్నివేశాలకి ఉచ్చులు బిగించడం – ఈ పరిశ్రమ అంతా 'చీకటిలో చీలికలు' నవల నిండా ప్రతిఫలిస్తుంది. జీవితానుభవం కల్పనకి ఓ గాంభీర్యాన్నీ, ఓ పద్ధతినీ, ఓ ఉద్ధతినీ కల్పిస్తుంది. అనుభవం లేని కల్పన కేవలం కీకారణ్యం. ఆలోచనల్లో రూపుదిద్దుకున్న పాత్ర నేలమీద నిలిస్తే దాని డైమన్షనే మారిపోతుంది. ఆ అనుభవం రచనకి తోడవడానికి యింకా జీవితం ముందుకి సాగాలి. ఇప్పటికి సాహిత్యంలో పెద్దల ప్రభావమే ఊతం. అదే నా మొదటి పెద్ద నవలకి ఊపిరి.

ఆ రోజుల్లో తెలుగు వార్తలు చదివే ఇద్దరు తెలుగునాట చాలా ప్రసిద్ధులు – పన్యాల రంగనాధరావు, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం. ఇద్దరికీ గుప్తా బ్రదర్స్ రామంగారు పరిచయ లేఖలు రాసిచ్చారు. అయితే పురాణం ఉండగా వాటి అవసరం లేకపోయింది. వీరుకాక తెలుగు వార్తా విభాగంలో సూరంపూడి సీతారాం, బుచ్చిరెడ్డిగార్లుండేవారు. ఆంధ్రపత్రికలో సీతారాంగారి నవలలు ప్రసిద్ధం. ఆకాశవాణిలో వార్తా విభాగానికి అధిపతి కపిల కాశీపతిగారు లబ్ధప్రతిష్ఠులు. పత్రికా

రంగంలో తనదయిన శైలినీ, బాణీని నిలుపుకున్నవారు. సోవియట్ విభాగంలో పనిచేసే బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావుగారు, ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారు, సెట్టి ఈశ్వరరావుగారు (వీరి తండ్రిగారు సెట్టి లక్ష్మీనరసింహంగారు విశాఖవారే. గొప్పకవి) వీరుకాక అప్పటి కేంద్ర మంత్రివర్యులు కొత్త రఘురామయ్యగారి భార్య కొత్త లక్ష్మీ రఘురాం, విశ్వనాథ వారబ్బాయి అచ్యుతదేవరాయలు, వాడ్రేవు పతంజలిగారు – వీరంతా ఎంతలేదన్నా నాకంటే దశాబ్దాలు పెద్ద. వీరందరి ముందు నేను పురాణం పందెపు గుర్రాన్ని.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments